మినీ కథ

# సీటు దొరికింది

– మిత్రా

"అమ్మయ్య" అనుకున్నాను. మొత్తం మీద బస్ వస్తోంది. ఇక్కడ దాదాపు పది నిమిషాలు ఆగుతుంది. నేనేమో అర్జంటుగా వెళ్లాలి. ఇప్పటికే అరగంట నించీ వెయిటింగ్. ఇది గనుక మిస్ అయితే, తిరిగి గంట పై వరకూ బస్ లేదు. ఇదే టెర్మినల్ పాయింట్‌కి వెళ్ళి, మళ్ళీ వెనక్కి రావాలి. ఇప్పుడూ అలాగే వచ్చింది. ఒకే ఒక సర్వీసు మరి!

బస్ రివర్స్ అయి, పాయింట్‌లోకి వచ్చి ఆగింది. అప్పటికి అదే బస్ కోసం ఎదురుచూస్తున్నవారు 'చాలా మంది' వున్నారు. బస్ ఆగీ ఆగగానే త్రోపులాట మొదలయింది. దిగేవాళ్ళు అరే దిగనియ్యండయ్యా' అంటున్నారు. కానీ వీళ్ళు అదే ... ంచుకోవడం లేదు. డ్రైవర్, కండక్టరు 'టీ'కి దిగి వెళ్ళారు.

నాకు ఏం చేయాలో పాలుపోలేదు. ఆ గుంపులో ప్రవేశం దొరకడమే కష్టం లాగుంది. కానీ అలా అని వదిలేస్తే, తర్వాతి సర్వీస్ కోసం (మళ్ళీ ఇదే) ఎదురు చూసే ఓపిక లేదు. అందుచేత 'ధైర్యే సాహసే...' అనుకుంటూ చొరబడ్డాను.

చేతిలో పుస్తకం నలిగి, క్రాపు చెదిరి, చొక్కా చిరిగిపోయినంత పనై- ఎట్టకేలకు బస్‌లో పాదం మోపగలిగాను. క్రింద ఇంకా పదిహేనుమంది దాకా వున్నారు. బస్సు చూస్తే, అప్పటికే నిండు గర్భిణీ అవతారం ఎత్తి, మా అందరి బరువుకీ వూగుతోంది. ఒకటే చెమట, గాలి తగలడం లేదు.

ఎడారిలో నీటి కోసం చూసినట్లు- ఆ రష్‌లో దొరకదని తెలిసినా, ఏదో ఆశతో 'సీటు' దొరుకుతుందేమోనని చూశాను. ఏదీ, కళ్ళు కనబడితేనా? ఒకటే జనం. అయినా శక్తినంతా కూడదీసుకుంటూ, కళ్ళు చికిలించి, తల త్రిప్పుతూ చూడసాగాను. అది అనవసర ప్రయాస అని తెలుస్తూనే వుంది.

నిరాశగా తల త్రిప్పకోబోతూండగా- నిజంగా ఒయాసిస్సు లాగానే కనబడింది, డబుల్ సీటు. కానీ, ఆ సీట్లో 'ఒకే' మనిషి కూర్చుని వున్నాడు. వక్కపొడి కాబోలు, తాపీగా నములుతున్నాడు. ప్రక్క సీట్లో, అతనిదే అయి వుండాలి అరటిపండ్ల గెల వుంది. దాని మీద చేయి వేసుకుని ఠీగ్గా కూర్చున్నాడు. ఇంతవరకూ ఈ దృశ్యం ఎవరి కంట్లో పడనందుకు ఆనందించాను. ఆ గెలని అతను ఒళ్ళో పెట్టుకుంటే చాలు, ఆ సీటు నాదే. ఉత్సాహంగా జనాన్ని నెట్టుకుంటూ ఆ వైపు నడిచేను.

"ఎక్స్‌క్యూజ్‌మి" అన్నాను. నా వైపు చూశాడతడు.

"మీరు కాస్త ఆ గెలని మీ వళ్ళో పెట్టుకుంటే, నేను ఈ సీట్లో సర్దుకుంటాను" అన్నాను.

అతడు చిద్విలాసంగా ఓసారి నవ్వి, గెలని తీశాడు. ఇంకేం? మహదానందంగా కూర్చున్నాను. ఇంతమందిలో కూడా నేను ఓ సీటు సంపాదించగలిగేను. అందరూ నా వైపు అసూయగా చూస్తున్నట్లు అనిపించసాగింది. బస్సు కదిలేందుకు ఇంకా అయిదు నిమిషాల వ్యవధి వుంది.



ఒక రెండు నిమిషాల తర్వాత అతడు నా వైపు తిరిగాడు. "మీరేమీ అనుకోకపోతే, కాస్త నా సీటు చూస్తుండండి. ఓసారి క్రిందకి వెళ్ళి, ఇప్పుడే వచ్చేస్తాను" అన్నాడు.

"తప్పకుండా!" అన్నాను. నాకు సీటు ఆఫర్ చేసిన వ్యక్తికి ఆ మాత్రం చేయలేనా అనుకున్నాను. అతడు గెల తన సీట్లో వుంచి, దిగి వెళ్ళాడు.

ఇంతలో ఒకతను వచ్చి ఆ సీటు అడిగేడు.

"లేదండీ! ఈ సీట్లో మనిషి వున్నారు. ఇప్పుడే క్రిందికి వెళ్ళాడు అతను." అన్నాను పళ్ళ గెల మీద చేయి వుంచుతూ. అతను అసంతృప్తిగా వెనుదిరిగాడు. నేను అదృష్టవంతుణ్ణి లేకపోతే ఇదే అసంతృప్తి నాకు మిగిలేది.

టైం అయినట్లుంది. డ్రైవరు, కండక్టరు వస్తున్నారు. నాకు సీటు ఇచ్చిన వ్యక్తి గబగబా వచ్చి బస్ ఎక్కాడు. అతని ప్రక్క ఎవరో ఒక వ్యక్తి నుంచుని వున్నాడు.

ఇతను నా దగ్గరగా వచ్చాడు. "థాంక్సండీ, ఎవరూ నా సీట్లో కూర్చోకుండా చూసినందుకు" అన్నాడు.

"ఫర్లేదులెండి, దానికేముంది" అన్నాను నేను.

అతను మళ్ళీ "ఇతను నా స్నేహితుడు. ఇందాక మీకు ఇచ్చిన సీటు ఇతనిదే. కొంచెం గాలి కోసం ముందే దిగి, క్రిందకి వెళ్ళాడు. కాబట్టి..." అన్నాడు. అతని ముఖం మీద అదే చిద్విలాసం.

నేను వెర్రి ముఖం వేశాను. వాళ్ళిద్దరూ గాలి పీల్చుకునేందుకు అలా దిగివెడితే ఈ ఉక్కబోతలో నేను, వాళ్ళ సీట్లలో ఎవరూ కూర్చోకుండా కాపలా కాస్తూ...

* ఆత్మ విశ్వాసం, ఆత్మ సంయమనం, పరిపూర్ణ శీలంలోని ముఖ్యాంశాలు

* నీ అంతరాత్మ చెప్పిన దాన్ని కాదనకుండా చేయగలిగినపుడే నీకు క్రమశిక్షణ ఉన్నట్టు